
**ఈవారం కథ**

# రంగురాళ్ళు

– గోపరాజు నారాయణరావు





## "కానిస్టేబుల్ బావూ!"

మరెప్పుడయినా అయితే ఆ కేకలోని దైన్యం, ఆతృత ఎవరివైనా కదిలిస్తాయి. కాని, అవే రాజ్యమేలుతున్నప్పుడు ఒక మనిషి బాధకు ఉనికేం వుంటుంది? ఎక్కడ చూసినా ఏడుపులు, పెడబొబ్బలూను.

అక్కడికి కాస్త ధూరంగావున్న ఓ జీడిమామిడి చెట్టు కింద ఒక దుంగమీద కూర్చున్న ఆ పెద్దావిడ మళ్ళీ పిలుస్తూ వడివడిగా ముందుకు వచ్చేసింది.

ఆ కానిస్టేబులు మాత్రం మహా విసుగ్గా చూశాడు ఆమెకేసి. కాని తమాయించుకుని అన్నాడు.

"ఇదిగో రావులమ్మా! నువ్వన్నిసార్లు చెప్పొద్దు.

మీ గుంటడి ఆనవాళ్ళు సెప్పేవు. గుర్తున్నాయి. పేరు కూడా గుర్తుంచుకున్నా"

విసవిసా వెళ్ళిపోయాడు కానిస్టేబులు.

"తెలిసినోడివని అడుగుతున్నాను. ఏటవుతాదో ఏమో? కన్నపేగు కదా బావూ!"

బేలగా, డగ్గుత్తికతో అన్నదామె.

ఒక్కసారి అంతా అటే చూశాం.

అరవై యేళ్ళుండొచ్చు. కాయకష్టం చేసుకునే మనిషి. దృఢమైన నల్లటి శరీరం. ముద్దల్లా వున్న దుద్దులు చెవి తమ్మెలను సాగతీసేశాయి. చెవులపైన పూస వంటి మరో ఆభరణం. ముక్కుకి అడ్డబాసు. అటు ఇటు తెల్లరాళ్ళ ముక్కుపుడకలు. మదురు, చుబుకం మణికట్లు ఏ ఆచ్ఛాదనా లేని భుజాలపైన పచ్చబొట్లు. 'తూరుపోళ్ళ' 'సంస్కృతికి అద్దంపట్టే చీరకట్టు. పసుపు రంగు సిల్కు దారపు అంచుతోవున్న ముదురు నీలం చీర మోకాళ్ళ దిగువ వరకు వుండి, ఎర్రమట్టి డాగులతో అసహ్యంగా వుంది.

అక్షరాలా కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి మళ్ళీ ఆ చెట్టు కింద దుంగపైనే కూర్చున్నదామె. గాఢంగా నిట్టూర్చినట్టుంది – ఆమెలో చిన్న కంపనం.

అంతలోనే ఏదో గుర్తు కొచ్చినట్టు చట్టుక్కున లేచి నిలబడి దాదావు వంద గజాల దూరంలో జరుగుతున్న హడావుడి కేసి కళ్ళప్పగించిందామె.

"కారు ముందుకెళ్ళదు సార్!" ఇంజన్ ఆపేస్తూ అన్నాడు డ్రైవర్.

కారు అగిన చోటు నుంచి ముందుకు గజం నేల కూడా సమంగా లేదు. ఇంతింత లోతు గోతులు. చిన్న చిన్న మట్టి దిబ్బలు. గోతుల నిండా వర్షం నీరు. ఇక్కడిదాకానయినా వచ్చాం చాలు. విశాఖపట్నంలో రాత్రి వర్షంలోనే బయలుదేరాం మా ప్రెస్ రిపోర్టర్లమంతా. నర్సీపట్నం ఎలాగో చేరాం. అప్పటికి వర్షం వెలిసింది. అక్కడ నుంచి పదహారు కిలోమీటర్లు దాటి ఈ పప్పుశెట్టిపాలెం రావడానికి గంటన్నర పట్టింది. మూడు రోజుల నుంచి తెరిపిలేకుండా కుమ్మరిస్తోంది.

వెనుక డోర్ తీసి ముందుగా నేనే కింద అడుగుపెట్టాను. అడుసులా వుంది ఎర్రమట్టి. చెప్పులతో సహా పాదాలను కమ్మేసింది చల్లగా.

"అదేననుకుంటా రంగురాళ్ళ స్పాట్!"

అంతా అటే చూస్తున్నాం. అయినా మాలో ఎవరో గొంతులో ఉద్వేగాన్ని అణుచుకుంటూ అన్నారు.

వంద గజాల దూరంలో ఎత్తయిన మట్టిదిబ్బల మీద నిలబడి వున్నారు కొందరు. ఇంకొందరు అటు ఇటు హడావిడిగా తిరుగుతున్నారు. నాలుగో, అయిదో జీపులు, నాలుగు అంబులెన్స్‌లు అక్కడ వున్నాయి. వర్షం వెలిసి చాలాసేపే అయినా

కొందరు లాంగ్ కోట్లు, టోపీలతోనే వున్నారు ఇంకా. బహుశా రాత్రంతా అక్కడే జాగారం చేసి వుండొచ్చు. ఈ వంద గజాల దూరం కూడా నిర్మానుష్యంగానే వుంది. పోలీసులు ఎవరినీ అనుమతించడంలేదు. భారీ బందోబస్తు పెట్టారు.

ఇవతల కనుచూపు మేర అంతా జీడిమామిడి తోటలు. ఆ తోపులలోనే పడిగాపులు పడి వున్నారు. వందలు కాదు, వేలాది మంది! చుట్టుప్రక్కల గ్రామాలు మొత్తం తరలివచ్చినట్టున్నాయి. ముసలి, ముతకా, ఆడ, మగా- తేడా లేకుండా అందరి ముఖాలలోను దిగులు. ఏ క్షణంలో ఏ మాట వినవలసివస్తుందోనని భయం. తలబాదుకుంటూ ఏడ్చేవారు కొందరు, రొమ్ములు బాదుకుంటూ రోదించే మరికొందరు. అందరి దృష్టి వంద గజాల అవతల జరుగుతున్న ఆ హడావుడి వైపే.

అక్కడే....

నిన్న సాయంత్రం మట్టిపెళ్ళలు విరిగివడి రంగురాళ్ళు తవ్వుతున్న వాళ్ళు చిక్కుకుపోయారు.

సందేహం లేదు. ఎవరూ బతికి బయటపడరు. నిన్న సాయంత్రం వర్షంలో జరిగింది ప్రమాదం. ఎన్ని శవాలను లెక్క పెట్టవలసివస్తుందోనన్నదే అక్కడవున్న వాళ్ళ దిగులు, ఉత్కంఠ.

ఎలా కనిపెట్టాడో ఆర్డీవో గబగబా మా కారు దగ్గరకు వచ్చి విష్ చేశాడు. వెంటనే అతని వెంట స్పాట్‌కు బయలుదేరాం.

"గంట క్రితమే సార్ తవ్వడం మొదలుపెట్టింది. పని సాగడంలేదు. నీళ్ళే పెద్ద తలనొప్పిగా వున్నాయి. ఓఎన్జీసి వాళ్ళ ప్రొక్లెయిన్ రప్పించాలనుకున్నాం. రోడ్లు బాలేదు. జనాన్ని అదుపు పెట్టడం ఇంకో సమస్య" ఆయన చెప్పకుపోతుంటే మేమంతా ఆసక్తిగా వింటున్నాం.

ఎం.ఎల్.ఏ., జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్, ఎస్.పి., డి.ఎస్.పి. లాంటి పెద్ద తలకాయలన్నీ అప్పటికే 'హుటాహుటిన' చేరిపోయినట్టుంది. అక్కడ కూడా ఫార్మాలిటీస్. అంతా విష్ చేశారు.

ఆ దిబ్బల మధ్య అప్పటికే వంద మంది దాకా తవ్వే పనిలో నిమగ్నమై వున్నారు. 'శవాల వెలికితీత' పని యుద్ధప్రాతిపదికపై జరిగిపోతోంది. సి.ఎం. ఆర్డర్స్.

"సంపదరావుగారూ! ఇవాల్టి పేపర్లో మీరిచ్చినంత డెత్‌టోల్ వుండదు. పరిస్థితి అంచనా వేసే చెబుతున్నా!" జిల్లా మంత్రి ఇబ్బందిగా ముఖం పెట్టి అన్నాడు.

"ఫస్ట్ ఇన్‌ఫర్మేషన్ అలాగే వచ్చింది. మీవాళ్ళు, మేము అదే నమ్మాం. అంత డెత్ టోల్ లేకపోతే సంతోషమే" అన్నారు సంపదరావుగారు. ఆయనే మా అందరికంటె సీనియర్. ఒక ఇంగ్లీషు డైలీ విశాఖ న్యూస్ బ్యూరో చీఫ్.

ఎవరో మరి. అక్కడే ఒక తెలుగు పేపరు చదువుతున్నారు. ఈ వార్తని పెద్ద డిస్‌ప్లేతో ఫస్ట్ పేజీలో ఇచ్చారు. అన్ని పేపర్లూ అలాగే వచ్చాయి.

"మట్టి పెళ్ళలు విరిగివడి
70 మంది సజీవ సమాధి?
రంగురాళ్ళ వేటే ప్రాణాలు తీసింది."

వార్త మధ్యలో ఫైల్‌ఫోటో కూడా పెట్టారు.

అంతా రైతు కూలీలు. రెక్కాడితేకాని డొక్కాడని వాళ్ళు. వాస్తవానికి కొన్ని మాసాల నుంచి విశాఖ జిల్లాలో రంగురాళ్ళ తవ్వకం ఒక మహమ్మారి తయారయింది. "రాయేమైనా దొరికినాదా? " అన్న మాట పలకరింపయిపోయింది. రంగురాళ్ళ వెలుగులో కాకులు దూరని కారడవుల వంటి పల్లెలు కూడా బుల్లిబుల్లి బస్తీలలా తయారయ్యాయి. పేపర్లలో మారుమోగిపోయాయి. ఆ గ్రామాలలో కుటుంబాలకు కుటుంబాలే తవ్వే పనికి అంకితమైపోయాయి. నేరేడు పండు రంగులో మెరిసే రాళ్ళు కొన్ని. చిలకాకుపచ్చగా సన్నని పసుపు చారలతో మెరిసిపోయేవి ఇంకొన్ని. నల్లవాటి పేరు మూన్స్. రెండో రకం పేరు కేట్స్. కేట్స్ ఇస్తే చేతికి ఎంత వస్తే అంత ఇచ్చేవారు రంగురాళ్ళ షరాబులు. మూన్స్‌కి విలువ తక్కువ. కేట్స్ దొరికితే పండుగ. ఒకడు ఐదొందలంటే మరొకడు ఏడొందలు తీసుకొమ్మంటాడు. సొమ్ము పెరిగింది. రాళ్ళ వేటా పెరిగింది. దళారులు వచ్చి వాలిపోయారు. మోసాలు పెరిగాయి. ఆశ, ఆరాటం ముదిరాయి. కొట్లాటలు జరిగాయి. తలలు పగిలాయి. స్థానిక నాయకులు రంగంలో దూకారు. బడ నేతలు చొరబడ్డారు. మంత్రులు మోజుపడ్డారు. ఎం.ఎల్.ఏ.లు వేలుపెట్టారు. అసెంబ్లీలో ప్రశ్నలు కురిశాయి. సర్కారువారు, శాస్త్రవేత్తలు అవి ఎందుకు కొరగానిగులకరాళ్ళని కొట్టేశారు. కాని తవ్వకం మన్యాన్ని ముంచెత్తుతోంది. వ్యాపారం కోట్లకు చేరిపోయింది.

రెండు గంటలు గడిచాయి. పని మందకొడిగా సాగుతోంది. దాదాపు వంద మీటర్ల వైశాల్యంలో 20 అడుగుల లోతుకి తవ్వి చూడాలి – శవాల కోసం

ఇకపై రాళ్ళ తవ్వకం నిషేధిస్తారట. అరెస్టుచేసిన వాళ్ళ దగ్గర దొరికినవేకాదు, శవాల దగ్గర దొరికినవి కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందట. అసలు ప్రమాదం నుంచి ఎక్కువమంది తప్పించుకుపోయారని అంటున్నారు. అయితే, దొరికితే ఏం చిక్కులొస్తాయోనని ఇళ్ళకు కూడా పోకుండా తప్పించుకుతిరుగుతున్నారని చెబుతున్నారు. ఇంతకీ ప్రమాదం ఎలా జరిగిందో ఇంతవరకు స్పష్టమైన సమాచారం మాత్రం లేదు. చెప్పడానికి ఎవ్వరూ ముందుకు రావడంలేదన్నదే అధికారుల వాదన. ఆ చెట్ల కింద పడిగాపులు కాస్తున్నవారి ఆశ కూడ అదే. తమ వాళ్ళెవరూ ఆ మట్టిపెళ్ళల కింద వుండరు. ఎక్కడో క్షేమంగానే వున్నారు. దీనికి హేతువేం లేదు. కేవలం ఆశ.

"శ్రీనివాసూ! అలా వెళ్ళి ఎవరినయినా కలిసొద్దాం నడు. క్లియర్ పిక్చరయినా తెలుస్తుంది. సాగర్ అప్పుడే వెళ్ళిపోయాడు" నాతో నెమ్మదిగా అన్నాడు రఘు. మేం ముగ్గురం మూడు తెలుగు పేపర్ల స్టాఫ్ రిపోర్టర్లం. మేం కదలడం గమనించి మా ఫోటోగ్రాఫర్ సుబ్బు కూడా బయలుదేరాడు.

జనం ఏవేవో చెప్పుకుంటున్నారు. ఎలా జరిగిందో చెప్పడానికి ఎవరూ ముందుకొచ్చేటట్టు లేరు.

ఎవరినడిగినా – "మాకేటీ తెల్దు బావూ! మమ్మల్ని ఒగ్గీయిండి" అన్నమాటే.


ఇంతలో ఓ జీడిచెట్టు కింద రఘు చెయ్యూపుతూ కనిపించాడు. మొత్తానికి ఎవరినో పట్టాడు గబగబా అక్కడ కెళ్ళాను.

అతడితో చనువు పెంచుకోడానికి, కాస్త ధైర్యంగా వుండడానికి భుజం మీద చెయ్యేసి ఇంకొంచెం అవతలకి తీసుకెడుతూ సంభాషణ మొదలు పెట్టాడు రఘు.

"నీ పేరేమిటి?"

"మజ్జి బుల్లెబ్బాయంటారు బావూ?"

సిగరెట్ పెట్టె తీశాడు రఘు.



## 'బైలో' రష్యా అంటే వైట్ రష్యా!

మాజీ సోవియెట్ యూనియన్‌లో కీల కపాత్ర వహించిన 'బైలో' రష్యా రిప బ్లిక్‌లో బైలోకు అర్థం మీకు తెలుసా? బైలో అంటే వైట్ (తెలుపు)! 1917లో రష్యన్ విప్లవం జరిగినపుడు కమ్యూ నిస్టులతో తలపడిన బైలో రష్యన్లను 'వైట్ ఆర్మీ'గా, సోషలిస్టులను 'రెడ్ ఆర్మీ'గా పిలిచేవారు




"తాగుతావా?" అతడిని అడిగాడు.

"తాగుతాను బావూ!"

"తీసుకో" ఇచ్చాడు రఘు.

గాలిలో తేమ, పుల్లలు వెలగడంలేదు. మరో పుల్లతీసి గీస్తుంటే అతడు అన్నాడు.

"సిగరెట్టు అయిదు రూపాయిల్జేసి అమ్మేసినారు బావూ!"

అగ్గిపుల్ల వెలిగింది. మూడు సిగరెట్లు వెలిగాయి..

"ఒక్క సిగరెట్టేకాదు బావూ! అన్నీ మండించేసినారు. మంచినీల్లు కూడా అమ్మే సుకున్నారు. డ్రింకు సీసాలు, అన్నం పొట్లాలు అమ్మి తెగ డబ్బు చేయిస్పేరు ఈ పది రోజుల్లో" దమ్ములాగుతూ చెప్పాడు బుల్లెబ్బాయి.

"మీరు నొల్లుకున్నారు కదా!" అన్నాడు రఘు.

"అదీ నిజమే బావూ! కాని, మాకంటా బోకర్ నా కొడుకులు తెగ తినీసేరు సాముఁ."

"ఇంతకీ ఎలా జరిగింది ప్రమాదం?" అడిగాను నేను.

"ఎలా జరిగిందంటే ఏటి సెబుతాను! అప్పుడు నేనక్కడ వున్న మాట నిజం. కాని ఈ మూడు రోజుల నుంచి జనం తక్కువే బావూ! మొండి నా కొడుకులం ఇంత వార్షంలో కూడా క్వారీలో దిగబడిపోయాం. వోరం కింద వున్నంత జనం వుంటే ఇంకేమైనా వుందా బావూ! సంగతేటంటే బావూ! నిన్న సందేల కూడా వార్షం మొత్తేసినాది కద్దా! తొందరగా చీకటి పడిపోతున్నాది. పిట్టుమాక్కులు ఎలిగించాలనుకుంటున్నాం. ఒగ్గంటాగితే మా జట్టు పని తెమిలిపోద్ది. ఇంకో జట్టు పనందుకుంటాది. వార్షం నీళ్ళు పక్కకి తోసేడం, తవ్వడం. అలా అందరం ఆబగా తవ్వేసుకుంటున్నాం. అగో అప్పడే దబేలుమన్నాది. మళ్ళీ చప్పడు. మా జట్టులో ఎవరికి తోచినట్టు పిక్క, బలం కొద్దీ పారొచ్చినాం. అసలే మసకెలుతురా! ఎవ ర్నయినా బయటకు లాగాలనిగాని, అసలేటి జరిగిందో చూడాలనిగాని ఒక్కలూ అనుకోలేదు. అసలు మరి తిరిగి సూడ్లేదు" చెప్పాడు బుల్లెబ్బాయి.

తరువాత ఒక్క క్షణమాగి చేతిలో సిగరెట్టు విరక్తిగా నేలమీద పడేశాడు బుల్లె బ్బాయి. గుండెలో బాధంతా వెళ్ళగక్కేశాడు.

"అన్ని రోజుల నుంచి ఇన్నిచోట్ల జనం రాళ్ళు తవ్వేసుకున్నారా?! ఏటీ కాలేదు. ఇక్కడే ఈ గోరం జరిగిపోనాది. ఈల్ల కర్మే అనిపిస్తది. అరకులో అన్ని దినాలు తవ్వారు. మనుసులే తన్నీనుకున్నారు. చండీసుకున్నారు. బూదేవి ఆగ్రయించలేదు. పాడేరు కాడ లింగాపుటే కొండ తెలుసుకదా బావూ! రోజుకి ఐదేలమంది రంగురాళ్ళ కోసమే కొండ మొత్తాన్ని నాకేసినారు. తురాయి గూడ, కొత్తూరు, దేవరాపల్లి, బెట్టంగారే, జోగులాపుట్ ఇన్నిచోట్ల తవ్వారు. కొన్నిచోట్ల నేను కూడా తవ్వాను. ఎక్కడా జరగలేదు ఇది.

నేనోటి సెబుతాను ఇంటారా బావూ! రాన్రాను మా నా కొడుకులకి ఆశ నాషైపోనాది. మొలతాడు కట్టిన మొగోడు తాళికట్టిన ఆడది అనేకాదు. బొడ్డూడని గుంటల చేత కూడా తవ్వించేసినారు. ఎవడుబడితే ఆళ్ళు ఓ పలుగు పార తెచ్చీడం, తవ్వీడం. ఆ తవ్వు ఎలాంటి తవ్వనుకుంతాను తమరు. ఎలక్కన్నం చూశారు కదా! అలా ఎలిపోయింది తవ్వు. పది ఏనుగులు చులాగ్గా ఎలిపోయేంత బెజ్జం. అక్కడితో ఆగనేదు. కొంత దవ్వు అలా తవ్వాక అక్కడ ఎవడో రూటు మార్చీసినాడు. సూస్తా వుండగానే కందకం మాదిరి తవ్వేసినారు – అడ్డంగా. అదిగో అదే ముంచేసినాది. కందకం అలా అలా చెరువు మాదిరి మారిపోయినాది. ఈ చెరువు తవ్వుతా వుండగానే ముసరూ మొదలయింది. నానిపోయింది నేల. చెరువు మీద ఆకాశంలా వున్న మన్ను ముద్దు కుండ పెంకులా చిట్లి, అందులో నలికిలపడిపోనాది"

అతడు చెప్పే తీరు మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. భయమంటే తెలియని మన్యం మనిషి. ఈ విషయాన్ని సాధారణంగా చెప్పాడు.

"మరి బుల్లెబ్బాయి! ఓ పద్ధతి, పాడూ లేకుండా గోతుల్లో దిగడం ప్రమాదమని మీకెవరూ చెప్పలేదా?" అడిగాను నేను.

"సెప్పటకేం బావూ! ఒక మాట సెప్పమంతారా!? నాకు అరవై దాటిపోతున్నాయి. చౌడు తినీసినట్టు ఇంటి పునాదుల్ని దొలిచి పారేస్తే నడికొప్ప కుప్పకూలిపోతదని నాకు సెప్పాలంటారా బావూ! నా మనవల వయసులో వున్న గుంటలు అక్కడ తవ్వుతున్నారు. చంటి గుంటలు కట్టే మట్టి గోపురాల కింద ప్రేణాల సంగతి వదిలేసి పాషాణాల కోసం దేవులాడతన్నారు. ఓపక్క కుండపోత. "ఒరేయ్! ఈ వర్షం తగ్గనివ్వండ్రా" అన్న ముక్క నేను అనలేకపోయాను. అనలేను బావూ! గోచిపాత రాయుళ్ళ ముందు కాసులు గలగలలాడితే కంటికి మరోటి కనిపిస్తదా? డబ్బు ఇరజిమ్మేసినారు నా కొడుకులు. గోతుల్లో దింపేసినారు మమ్మల్ని. నిన్న సందేలదాకా ధనం మూటలు వీపు మీదేసుకుని ఇక్కడే దేవుళ్ళాడారా రంగురాళ్ళ షావుకార్లు 'అమ్మో! దిగడిపోనారు కూలోళ్ళు' అన్నారు. ఒక్క నా కొడుకూ మిగల్లేదు. తుపాకీ దెబ్బకి దొరక్కుండా ఉడాయించేసినారు. ఇప్పుడు జరిగేదేట నుకున్నారు. షావుకార్లు దొబ్బేసినారు. దళారి నా కొడుకులు పత్తా వుండరు. కేసులు చావులు మాత్రం మాకు. లోతట్టులో నక్సలైటు అన్నల కోసం మావోళ్ళని కుళ్ళ బొడిసీసినట్టు ఇగ మమ్మల్ని పోలీసోళ్ళు నంజేసుకుంతారు. రంగురాళ్ళు పేరు సెప్పి నాలుగు రాళ్ళు ఎనకేసుకున్నోళ్ళు గుప్పెడుమంది కూడా లేరు బావూ! రాళ్ళు షావుకార్లు ఎత్తుకెల్లారు. డబ్బు దళార్లు నొల్లుకున్నారు. మాకేటి మిగిలింది? పోలీసోడి ముద్దెనక తిరగడం ఒకటే బావూ!"

ఎక్కడి నించో ఒక మైక్రోఫోన్ తెచ్చారు. ఏవేవో హెచ్చరికలు చేస్తున్నారు.

బుల్లెబ్బాయి తెగించినట్టు ఎన్నో సంగతులు పాతవీ కొత్తవి చెప్పుకుపోతున్నాడు.

ఒక్కసారి కలకలం.

కొంతమంది పోలీసులని లెక్క చేయకుండా ఆ స్పాట్ వైపు పరుగు తీస్తున్నారు. పోలీసులు, రెవిన్యూ అధికారులు సహనంతో మైక్‌లో విజ్ఞప్తులు చేస్తున్నారు.

బుల్లెబ్బాయి 'దణ్ణం బాబూ!' అనేసి ఎటో వెళ్ళిపోయాడు. మేం ముగ్గురం స్పాట్‌వైపు నడిచాం.

తవ్వుతున్న ప్రదేశానికి కాస్త అవతల కొంచెం పొడిగా వున్నచోట శవాలను తెచ్చి పడుకోబెడుతున్నారు. తలగుడ్డలు, పోలిథిన్ కవర్లు, క్యారియర్లు, చెప్పలు కూడా మరోపక్కగా పెడుతున్నారు. వాటిని బట్టి శవాలను గుర్తిస్తారు.

రెండు శవాలను తెచ్చి ముందుగా పడుకోబెట్టి బకెట్లతో నీళ్ళుకొట్టారు. ఒక వ్యక్తి నలభై ఏళ్ళుంటాయి. రెండో శవం ఒక యువకుడిది. పదిహేను మించవు. మొదటి శవం వంటి మీద గుడ్డ బనియన్ వుంది. పొట్టమీద వుండవలసిన జేబు బరువుగా పక్కటెముకలపైన వేలాడుతోంది. అన్నీ రంగురాళ్ళే! మరో రెండు శవాలు బయటపడ్డాయి. మరో శవాన్ని తెచ్చి పడుకోపెట్టారు. భోజనం

